

# "తారుమారు"

రచన: "రవిచంద్ర"

గాలిదేవుడు మాయమయ్యాడేమో చెట్లు నిర్జీవ ప్రతిమల్లా కదలక మెదలక నిల్చున్నాయి. స్తబ్దుగా ఉంది ప్రకృతి. సూర్యుడు భూమి అడుక్కు దిగిపోయాడు. ఎర్రరంగు పూసుకున్నాయి మేఘాలు. చీకటి నల్లని ముసుగుతో కాలుబెడుతోంది. ఓ మూల చవితి చంద్రుడు రేఖామాత్రుడై మెరుస్తున్నాడు. తగ్గిపోతోన్న వెలుతురులో రాజు నిశితంగా ఎవరికోసమో ఎదురుచూస్తున్నాడు పార్కులో సిమెంటుబెంచీ కంటుకుని.

ఇంతటి విషమసమస్య సంప్రాప్తమవుతుం దని కలలోగూడా అనుకోలే దతడు. ఏంచేయగల డిప్పుడు. నాన్న ధనదాహం తనకు శత్రు వయింది. తను మనసారా ప్రేమించిన మంజులను మరచిపోవలసిన పరిస్థితి ఏర్పడింది. చూస్తూ చూస్తూ ఆమెను ఇతరుల సొత్తుక్రింద ఎలా తలచగలడు. తన ఆశయాలన్నిటిమీదా సమాధులు కట్టబడుతున్నాయి.

పెళ్లిపనులు చురుకుగా సాగిపోతున్నాయి గాని తన వ్యధ నర్థంచేసికొనే దెవరు? ఈ పెళ్ళి తన కిష్టంలేదని అందరికీ తెలుసు. కాని జరిగిపోతోంది. అమ్మకు గుండెలులేవు నాన్నను ఎదిరించడానికి. తనకు దమ్ములు చాలవు ఎదురు చెప్పడానికి.

మంజుల హృదయంలో ఎన్ని ఆశలు నింపాడు తను. అవన్నీ తన చేతులతో ఎలా నాశనం చేయగలడు? ఇక ఈజన్మలో ఆమెకు తనముఖం చూపించగలడా. తనంటే ఎంత అసహ్యత చూపిస్తుందిక. నాన్న నెదిరించి ఆమెను పెండ్లాడితే తన జీవిత మెలాసాగుతుంది. ఇద్దరూ అష్టకష్టాలు పడవలసివస్తుం దేమో. దమ్మిడీ సంపాదనలేని తను మంజుల నెలా సుఖపెట్టగలడు?

పరిస్థితుల ప్రభావానికి తనూ తలయొగ్గక తప్పదు. ఇంతకాలం ప్రేమామృతంతో పెంచుకున్న ప్రేమలతను వ్రేళ్లతో సహా తన హృదయంలోంచి తీసివేయక తప్పదు!! అనుక్షణం కళ్లముందు సాక్షాత్కరించే మంజుల మనోహర రూపంపై అచ్ఛాదన కప్పక తప్పదు. కాని తన వివాహవిషయం ఆమెకు ఎలా చెప్పగలడు. ఆమె మనస్సు వికావికలమైపోయి ఎంత దుఃఖిస్తుందో కదా?

పెండ్లియాడే ధైర్యం లేకపోతే ప్రేమించనే కూడదు. అమాయకురాలైన మంజులను నిజంగా తనే ఈ గ్రంధంలోకి దింపాడు. చివరకు తల్లిదండ్రుల నెదిరించలేక, నమ్మిన ప్రేయసిని ద్రోహంచేస్తున్నాడు. ఎంతటి పిరికివాడు తను. తనవంటి తుచ్ఛుడు నీచుడు ఈ లోకంలో ఇంకెవరైనా ఉంటారా?

ఇంతలో అతని మనస్సులో మరోభావం మెదిలింది. క్రమక్రమంగా అతని ఆలోచనలు ఒక స్థిరరూపానికి వచ్చాయి. పెండ్లి చేసుకుంటానని మంజులకు తనేమీ మాటివ్వలేదు. ప్రేమించినంత మాత్రాన పెండ్లిచేసుకోవాలనే రూలెక్కడాలేదు. పైగా తను పురుషుడు. కంటికి అందంగా కనబడే స్త్రీలను ప్రేమించే అధికారము తనకు ఉంది. కాని మంజులను తనను ప్రేమించమని బ్రతిమలాడలేదే. ఆమే తనంత తానుగా ప్రేమించింది. తనూ ఆమెను ప్రేమించినమాట వాస్తవమే, కాని పరిస్థితులు అనుకూలించనప్పుడు తనుమాత్ర మేమిచేయగలడు. ఏది ఏమైన తన వివాహం తండ్రి యిష్టప్రకారం జరుగుట ఖాయం. ఈ విషయాన్ని తాను నిజాయితీపరుడు కనుకనే ఆమెకు చెప్పగలుగుతున్నాడు. అని తనను తాను సమర్ధించుకోజూచాడు రాజు. కాని సతమతమైపోయే అతని మనస్సులో మంజులకి విషయం ఎలా చెప్పటమా అనేబాధ మాటిమాటికి రగులుకొచ్చింది.

ఇంతలో మంజుల భారంగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది. ఆమె కురులు తైలసంస్కార శూన్యాలై గాలికి ఎగురుతున్నాయి. సహజంగా ప్రసన్నంగా ఉండే ఆమె దుఃఖభారంతో నిండి ఉంది. మెల్లిగా రాజు వెనుకకువచ్చి "రాజూ" అంది.

ఉలిక్కిపడి వెనుదిరిగి చూచాడు. వెనుక నిల్చుని ఉన్న మంజులను చేయిపట్టుకుని తనప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. ఆమె కళ్ల నుండి అశ్రుబిందువులు జలజలా రాలుతున్నాయి. రాజుకు ఆమెను చూడగానే భయమయింది. కొంపతీసి ఈమెకు నా వివాహ విషయం తెలియలేదు కదా. ఈమెను తనెలా సమాధాన పరచగలడు. ఆమె ముఖంలోకి చూడలేకపోయాడు.

మంజుల గద్గదికంగా "రాజూ .... నీవు నన్ను...." అని సగంలో నిలిపేసింది. ఆమెకు దుఃఖం పొర్లుకొచ్చింది. రాజుకు మాట పెగల్లేదు. తన వివాహవిషయం ఈమెకు తెలిసిపోయింది. ఇక దాచి లాభం లేదు. తన హృదయబాధను, పరిస్థితులు అననుకూలాన్ని ఎలా విప్పి చెప్పగలడు. తన అసమర్ధత నెలా కప్పిపుచ్చుకోగలడు?

"మంజులా నిన్ను నేను మనసారా ప్రేమిస్తున్నాను. కానీ...." ఆమె అతని నోటిని అప్రయత్నంగా మూసింది. ఆమెకు దుఃఖం ఆగలేదు. ముఖం చేతులతో కప్పుకుని అలాగే వుండిపోయింది. కొద్ది క్షణాలవరకూ రాజు తేరుకోలేకపోయాడు.

మంజుల మెల్లగా మాట్లాడసాగింది. "నన్ను క్షమించు నా ప్రియమైన రాజూ.... పరిస్థితులు నా చెయ్యిదాటిపోయాయి. మా నాన్న నిర్ణయానికి తల ఒగ్గవలసి వచ్చింది.

అమ్మ కళ్లనీళ్లతో నాచేత వాగ్దానం చేయించుకుంది. రెండోపెండ్లివాడయిన మా మామయ్యను పెండ్లాడి తీరవలసిన బాధ్యత నాపైన బడింది. ఇక నా ఆశ వదులుకో రాజూ.... నేనొకరి సొత్తు నయిపోతున్నాను....నన్ను శాశ్వతంగా మరచిపో,...నీ మంజుల మరణించింది రాజూ...." అంటూ విలపించసాగింది.

తా నొకటిదలిస్తె దైవమొకటి తలచిందన్నట్లు ఏమిటీ వైపరీత్యం. దేవుడు చాలా మంచివాడు అనుకున్నాడు. అతని గుండెల్లో చల్లగాలులు వీచాయి. బరువైన అతని హృదయం తేలికయింది. తలమీంచి ఎన్నో మణుగుల భారం దించినట్లయింది, దీర్ఘంగా నిట్టూర్చాడు. అతనికి మంజులను ఏడిపించాలని బుద్ధిపుట్టింది. రాని కన్నీళ్ళను చేతితో తుడుచుకున్నాడు. కళ్ళు పెద్దవిచేసి జుట్టు చెరిపేసుకున్నాడు. ఆమె వడిలో తలపెట్టి "మంజులా ఎంత భయంకరమైన విషయం చెప్పావు. నా గుండె బ్రద్దలయిపోతోంది. నేనిక బ్రతకను. నా హృదయంలో ఆరని నిప్పు రగిలించావు. మంజులా నిన్ను మరువలేను" అంటూ తన ముఖభావాలను గొంతును మార్చాడు.

మంజుల అతనిదుఃఖం నిజమే ననుకుంది. విచారంతో ఆమెగుండె బ్రీలిపోయింది. కాని నెమ్మదిగా "రాజూ నీవంటి ప్రేమికుణ్ణీ పొందగలగడం నా పూర్వజన్మ సుకృతం. కాని విధి నన్ను మంచిచూపు చూడలేదు. మా నాన్న తాంబూలాలు మార్చుకొని ముహూర్తం నిశ్చయించుకొని వచ్చేశాడు. ఇప్పుడు నేను ఎదురుతిరిగి లాభంలేదు. నన్ను మరచిపో.... ఈ కఠినురాలను క్షమించు. అంటూ అతని మీద వాలిపోయింది.

మెల్లగా రాజు ఆమెను లేవనెత్తాడు. కన్నీళ్లతో ఆమె వక్షస్థలమంతా తడిసిపోయింది. "మంజులా నిన్నెంతగా ప్రేమించానో నీకే తెలుసు. మనమెన్నో వాగ్దానాలుగూడా చేసుకున్నాం. అవన్నీ నీవు పాటిస్తావనుకున్నాను. కాని సమయమొచ్చేసరికి కన్నీళ్లతో ప్రేమించిన ప్రియుణ్ణి అవలకు నెట్టుతావని తలచలేదు. నీ దెంత కఠినహృదయం. నేనే ఈ విధంగా ప్రవర్తించియుంటే ఏమయేది. నీ వెంత నిందించేదానివి. నా హృదయాన్ని గాయపర్చిన నిన్ను నేను క్షమిస్తున్నాను. కాని నామనస్సులో నీ మోసకారితనం స్థిరముద్ర పరచుకొని శాశ్వతంగా ఉంటుంది. నా మంజుల మోసంచేసింది. నన్ను తీవ్ర హింసకు గురిచేసింది అనే భావన నేనెలా మరచిపోగలను" అన్నాడు తీవ్రంగా. క్షణం గడిచింది మంజుల అతనివద్ద సెలవుతీసికొంది. విడువలేక విడిచినట్లు విడిచాడు రాజు. ఆవరించిన కటిక చీకటిలో కలిసిపోయింది మంజుల. రాజు సంతోషంతో ఇంటికి చేరుకున్నాడు. మరునాటి ఉదయం మంజుల, స్నేహితురాలు ఉష, ఇంటికి వెళ్ళింది. అక్కడ ఆమెకు రాజు వివాహవిషయం తెలిసింది. ఆమె మనస్సులో అతని ధూర్తత్వం కన్నులకు కట్టినట్లు కనిపించింది.

రాజు ఉదయమేలేచి బజారుకు వెడుతుండగా మంజులతమ్ముడు అతనివద్దకువచ్చాడు. అతని చేతిలో చిన్న చీటీ ఉంది. "అక్కనీకిమ్మంది" అని వెళ్ళిపోయాడు. ఆతురతతో విప్పాడు రాజు.

"మిత్రుడు రాజుకు :

మొన్న సాయంకాలం తరువాత నాకు ప్రపంచం తెలిసివచ్చింది. నిన్నటిదినం నా జీవితంలో వెలుగు చూపింది. ఇంతవరకూ నేనేది సత్యమని నమ్మానో అది అసత్యమయిపోయింది. ఇక ఈ లోకంలో ఎవరిని నమ్మరాదని నిశ్చయించుకున్నాను.

నేను మాటతప్పానని, మోసకారినని నన్ను నిందించావు. నిన్నటిదినం నీ వివాహవిషయం తెలిసింది. నాకంటే ముందుగానే, నాకు తెలియకుండానే పెళ్ళిసంబంధం చూచుకొని ముహూర్తం నిర్ణయించుకొని నీవు నాదగ్గర ఆ విషయం దాచిపెట్టావు. నీ మౌనం బయల్పడిందని చింతించకు. నీ వింత కుటిలాత్ముడవని, నాదగ్గరనే నీ వింత కపటంగా ప్రవర్తించావని తలచుకొని బాధపడ్డాను. మొన్న నీ వభినయించిన దుఃఖం నిజమని నమ్మిన నేను ఎంత అమాయికురాలనో తెలిసికూడా నీవు నన్ను మోసగించావు. అట్టి నిన్ను పొందకపోవడం నా అదృష్టం. గుండెలమీద చెయ్యివేసుకుని మోసంచేసిం దెవరో ఆలోచించు.

సెలవు.... మంజుల"

"నేనే మంజులా" అంటూ గుండెలపైన చేయివేసుకుని కూలబడ్డాడు రాజు.

★

## 'రచ్చకెక్కిన పెండ్లిపెద్ద

మా దగ్గర బంధువులలో ఒకతని కుమార్తెకు పెండ్లి నిశ్చయమయినదని, మేనల్లుడుకు యివ్వడం తప్పలేదని, పైగా యిదివరకు ఎవరూ యివ్వనంత కట్నం యిస్తున్నాడని యిది అందరకూ ఆశ్చర్యముగా వున్నదని తప్పక రావలసినదిగా మాఅన్నగారివద్దనుంచి ఉత్తరం వచ్చింది. పెండ్లిపెద్ద యింకా యితర బంధువులు విజయనగరంలో పెళ్ళి సామానులు కొనుటకు వచ్చి నాతోపాటె ఆ గ్రామములో దిగారు ఆ చీకటిలో నన్ను వారు గమనించలేదు. యీ వారం కర్పూరదండలు చాల ప్రియముగా వున్నవని పెళ్లిపెద్ద తక్కిన బంధువులతో అన్నాడు "వచ్చేవారం చాల చౌకగా వుంటాయట" అని నేను చలోక్తిగా అన్నాను. ఆ బంధువులలో ఒకడు అన్నాడనుకొని "వచ్చేవారం ఎవరికావాలి" అన్నాడా పెళ్లిపెద్ద. అయితే యీ వారం ఎందుకు ప్రియముగావున్నాయో తెలుసుకున్నారా? అన్నాను. యీ మాట అనగానే అరె. నీ వెప్పుడువచ్చావని అందరూ పలకరించారు అందరమూ గ్రామము చేరాము పెళ్లిపెద్ద మాత్రం చిన్నముఖం చేసుకున్నాడు.

పెండ్లి అయిన మరునాడు పాట కచ్చేరికి ఏర్పాటుచేసారు. సాయంత్రం 4 గం॥లకు పాటకచేరికి వెళ్లాను. పెళ్లిపెద్దమాత్రము పందిరిలోకి వచ్చి పలహారములు చేసారాని ఒక్కొక్కరిని పలుకరించుకుంటూ నావద్దకు కూడా వచ్చేరు. నన్ను చూడగానే రాత్రి మాటలు జ్ఞాపకానికివచ్చి, నన్ను నలుగురిలోను అగౌరవించాలని ఉద్దేశముతో "పలహారం" అయిందా అని ఒక చెవిటివానికి చెప్పినట్లు గట్టిగా చెప్పాడు. ఇది నేను సదవకాశముగా తీసుకొని "ఆ ... పదిహేను వందలు కట్నం యిచ్చేనంటున్నారా? మీచెల్లెలు యింకొంచము బెదరించివుంటే రెండువేలరూపాయిలు యిచ్చేవారే ... అని అనుకోకుండా అనేసరికి, పందిరి అంతా పక్కున నవ్వింది పెళ్లిపెద్ద ముఖం మళ్లీ చిన్నపోయింది.

—యిండుగు గోపాలరావు.